క్లుప్తంగా

మాతమ్మ గెరిగకు ప్రత్యేక పూజలు



మాతమ్మ తల్లి గెరిగ ఊరేగింపు

పాలసముద్రం: మండలంలోని ఎస్‌కేఆర్ పురం పంచాయతీ ఆదిఆంధ్రవాడలో వెలసిన మాతమ్మతల్లి గెరిగకు మంగళవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. మాతమ్మ కొలువు మహోత్సవంలో భాగంగా ఉదయం అమ్మవారికి ప్రతి ఇంటి నుంచి మహిళలు అంబళ్లు పోసే కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్నం అమ్మవారి గెరిగను పూలతో సుందరంగా అలంకరించి బాణసంచా పేల్చి పంబవాయిద్యాలతో పుర వీధుల్లో ఊరేగించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు అమ్మవారి గెరిగకు కొబ్బరి కాయలు కొట్టి, కర్పూరం వెలిగించి ప్రత్యేక దీపారాధన చేపట్టారు.

వరసిద్ధునికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం నిత్య అన్నదాన ట్రస్టుకు మంగళవారం ఓ దాత నగదు విరాళం అందించారు. తిరుపతికి చెందిన గుండాల్‌రెడ్డి రూ.లక్ష అన్నదాన ట్రస్టుకు విరాళంగా ఇచ్చారు. ఆలయ సిబ్బంది దాత కుటుంబానికి ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించారు.

ప్రతి గ్రామంలో వైద్యసేవలు



కుప్పిగానిపల్లెలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్

గుడిపాల: ప్రతి గ్రామానికి వెళ్లి వైద్యసేవలను అందిస్తునున్నట్లు బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత అన్నారు. కుప్పిగానిపల్లె గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి రోగికి వారి విషయాలను తెలుసుకుని వైద్యసేవలు అందించి పలు సలహాలు, సూచనలను అందజేస్తున్నామన్నారు. ఎవరైనా నడవలేని పరిస్థితుల్లో ఉంటే వారి ఇంటివద్దకే వెళ్లి వైద్యం అందజేస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రతి బుధవారం, శనివారం ప్రత్యేకంగా ఆయుష్మాన్ భవన్ మందిర్‌లో రక్తపరీక్షలు చేసి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. మధుమేహం, బీపీలతో ఇతర వ్యాధులకు సంబంధించి 55 మందికి వైద్యసేవలను అందజేసి వారికి ఉచితంగా మందులు, మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సరళ, శివగామి, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉన్న మండలాల్లోనే బదిలీలు చేయాలి



ఎంపీడీఓ సతీష్‌కి వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

పాలసముద్రం: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలను ఉన్న మండలాల్లోనే చేపట్టాలని సచివాలయ ఉద్యోగులు మంగళవారం తహశీల్దార్ అరుణకుమారి, ఎంపీడీఓ సతీష్‌కి వినతిపత్రాలు అందించారు. వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ శాఖ జీఓ నెంబర్-5 ద్వారా సచివాలయ ఉద్యోగులకి సొంత మండలాల్లో పోస్టింగ్ ఇవ్వకూడదనే కొత్త నిబంధన విధించారన్నారు. గతంలో రెండు సార్లు సచివాలయ ఉద్యోగులకి బదిలీలు జరిగాయన్నారు. అయితే ఈ నిబంధన విధించలేదని తెలిపారు. చిన్న జీతంతో సొంత ఊరికి దూరంగా ఎక్కడో చేయడమనేది చాలా భారంగా మారుతుందన్నారు. సమస్యని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాల్సిందిగా కోరారు.

మండల పరిధిలోనే బదిలీలు చేపట్టాలి



ఎంపీడీఓకి వినతి పత్రాన్ని అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

బంగారుపాళెం: గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీలను సొంత మండలాల పరిధిలోనే నిర్వహించాలని ఆ సంఘం నాయకులు మంగళవారం ఎంపీడీఓ మహేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. మండల సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటేష్, గౌరి, శివకుమార్, భరత్ మాట్లాడుతూ, గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు కోరుకున్న చోటకు బదిలీ చేసి, ఇతరులను స్థానిక మండలాల పరిధిలో బదిలీలు చేపట్టాలని కోరారు. స్థానిక మండలాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను ఇతర మండలాలకు బదిలీ చేసే అంశాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. సీనియారిటీ ప్రకారం మెరిట్ కం రోస్టర్ విధానంలో నోషన్ ఇంక్రిమెంట్లు విడుదల చేయాలన్నారు. పదోన్నతులు కల్పించాలని, పే స్కేల్ విషయంలో సమన్యాయం పాటించాలని డిమాండ్ చేశారు.

పచ్చిరొట్ట శ్రేయస్కరం

– మోతాదుకు మించి ఎరువుల వాడకం అనర్థం



సాగులో ఉన్న జనుము

వడమాలపేట (విజయపురం): పంటకు ఘన, ద్రవ ఎరువులు, పచ్చిరొట్ట, పచ్చి ఆకు ఎరువులు, జీవన ఎరువులు ముఖ్య పోషకాలు ఎంతో ముఖ్యం. పంట ఎదుగుదలకు 16 రకాల పోషకాలు అవసరం. వీటిలో నత్రజని, భాస్వరం, పొటాషియం ఎక్కువ మోతాదులో అవసరమవుతాయి. ఉప పోషకాలైన క్యాల్షియం, మెగ్నీషియం, గంధకం తక్కువ మోతాదులో అవసరం. ఇనుము, మాంగనీస్, రాగి, జింకు, బోరాన్, క్లోరిన్, అల్యూమినియం, నికెల్ తదితర సూక్ష్మ పోషకాలు కూడా పంటకు తక్కువ మోతాదులోనే అవసరమవుతాయి. కానీ రైతులకు అవగాహన లేక మోతాదుకు మించి వేస్తుంటారని, దీంతో ఫలితం ఏ మాత్రం ఉండక పోవడంతోపాటు అదనపు ఖర్చు అవుతుందని ఏఓ విజయ్‌కుమార్ తెలిపారు. ఏ ఎరువు ఎందుకు ఉపయోగ పడుతుందో వివరాలను ఆమె పూర్తిగా వివరించారు.

పొటాషియం

మొక్కల్లో జరిగే జీవ రసాయన క్రియల ఎంజైమ్‌ల తయారీకి పొటాషియం అవసరం. మొక్కకు రోగ నిరోధక శక్తిని ఇస్తుంది. పురుగులు, తెగుళ్ల ఆశించకుండా కాపాడుతుంది. వాతావరణ ప్రభావాల నుంచి పంటను రక్షించడమే కాకుండా కాయలు, గింజలు పండ్ల నాణ్యత పెరుగుతుంది.

భాస్వరం

భాస్వరంతో వేర్ల పెరుగుదలకు, గింజ కట్టేందుకు ఉపయోగకరం. మొక్క పెరుగుదలకు కొమ్మలు తొడగడానికి అవసరం. నేలలోని సేంద్రియ పదార్థం చివికేలా చేస్తుంది. ప్రొటీన్, ఎంజైమ్‌ల తయారీకి ఉపయోగపడుతుంది. పుష్పజాతి పంటలకు ఎక్కువ భాస్వరం అవసరం.

మెగ్నీషియం

మెగ్నీషియంతో ఎంజైమ్‌లలో చురుకుదనం కలిగిస్తుంది. నేలలోని భాస్వరం గ్రహించడానికి తోడ్పడుతుంది.

నత్రజని

నత్రజని మొక్కల జీవిత కాలమంతా అవసరమే. మొక్క పెరుగుదలకు, దుగ్గు కట్టడానికి అవసరం. నత్రజనితో ప్రొటీన్ శాతం పెరుగుతుంది.

పచ్చిరొట్ట ఎరువులు

పంటకు అవసరమయ్యే పోషకాలు సేంద్రియ రూపంలో సమర్థవంతంగా అందించాలంటే పచ్చిరొట్టను భాగా అందించాలి. పచ్చిరొట్ట పంటలను అదేపొలంలో ముందుగా వేసుకోవాలి. తక్కువ వనరులతో బాగా పెరిగిన పంటలను సుమారు రెండు నెలల ముందే పొలంలో విత్తుకోవాలి. ఆ పంట పూతకు వచ్చే సమయంలో భూమిలో కలియదున్నాలి. దున్నిన రెండుమూడు వారాలకు బాగా కుళ్లడంతో విడుదలైన పోషకాలు పొలంలో విత్తిన పంటకు అందుతాయి. ఉదాహరణకు మినుము, అలసంద, జీలుగ, పెసర, ఉలువలు, బఠాణీ, పిల్లిపెసర, జనుము.

పచ్చి ఆకు ఎరువులు



పచ్చిరొట్ట వేసుకోవడం కుదరని పరిస్థితిలో దగ్గరలో ఉన్న చెట్ల ఆకులను, లేతకొమ్మలను తీసుకొని వచ్చి పొలంలో కలుపు కోవచ్చు. పచ్చిఆకు ఎరువుకు అనువైన పంటలు జిల్లేడు, సీతాఫలం, వెంపలి, తంగేడు, తగరంచ, బాడిశ తదితర మొక్కలను చేలో వేసుకోవచ్చు. వరి పొలాల్లో వేసుకునేందుకు అనువైన పప్పు ధాన్యాలు–పెసర, అలసంద, శనగ, సోయా చిక్కుడు, వేరుశనగ, కంది వేసుకోవచ్చు.

– విజయ్‌కుమార్, ఏఓ, వడమాలపేట

డిగ్రీ కళాశాలలపై చిన్నచూపు అన్యాయం



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పట్నం సురేంద్రరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం డిగ్రీ కళాశాలల పట్ల చిన్నచూపు చూడటం అన్యాయమని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పట్నం సురేంద్రరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇంజినీరింగ్ విద్యకు ప్రాధాన్యతనిస్తూ డిగ్రీ కళాశాలలకు తీరని అన్యాయం చేస్తోందని ఆరోపించారు. డిగ్రీ కోర్సు పూర్తి అయినా కూటమి ప్రభుత్వం ఇంత వరకు కళాశాలలకు ఫీజు బకాయిలు చెల్లించలేదన్నారు. స్కూల్ విద్యార్థులకు రూ.13 వేలు, ఇంటర్ విద్యార్థులకు రూ.13 వేలు డిగ్రీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా ఆలస్యం చేయడం తగునా అని ప్రశ్నించారు. డిగ్రీ కోర్సు పూర్తి అయినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోతే ఉన్నత విద్యార్థుల భవిష్యత్, కళాశాలల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇంజినీరింగ్ విద్యకు ఇచ్చినంత ప్రాధాన్యతను కూటమి ప్రభుత్వం డిగ్రీ కళాశాలలకు ఎందుకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలు డిగ్రీ కళాశాలల నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థులను ఉర్దూ పాఠశాలలో చేర్పిస్తున్న ఎంఈఓ విజయకుమార్

కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తోందని మండల విద్యాశాఖ అధికారి విజయకుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో బడి ఈడు పిల్లలను చేర్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలో క్రమశిక్షణతోపాటు, నాణ్యమైన విద్య లభిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్‌ఖాజీ జాఫర్‌అలి, హానఫీ, ఢంకా హమీద్‌బాషా, షేక్ సందానీ, ఎంఈఓ–2 మనోజ్‌కుమార్, ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం జబీనా సుల్తానా, సహితోత విద్య ఉపాధ్యాయులు సింధూజ, రేఖ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెచ్‌ఎం, టీచర్లు

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉన్నత విద్య అందిస్తున్నారని శ్రీకావేరిరాజుపురం ప్రధానోపాధ్యాయుడు ఆర్‌చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఏట్టుకూరిపల్లె, మిట్టదళితవాడ గ్రామాల్లో ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపించే తల్లిదండ్రులతో హెచ్‌ఎం మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఇంగ్లీష్ మీడియం ఉందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. పిల్లలకు అనుగుణంగా చదువులు నేర్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. ఆయన వెంట టీచర్ కోదండయ్య, సీఆర్పీ రాజేశ్వరి ఉన్నారు.

ఇందిరమ్మ కాలనీలో గంగమ్మ జాతర



అమ్మవారికి అంబలి సమర్పిస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని ఇందిరమ్మ కాలనీలో మంగళవారం గంగ జాతర ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా ఉదయం అమ్మవారి అంబలి, సాయంత్రం పొంగళ్లు సమర్పించారు. రాత్రి అమ్మవారిని గ్రామంలో ఊరేగించి నడివీధిలో ఏర్పాటు చేసిన మండపంలో కొలువు దీర్చనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం సాయంత్రం అమ్మవారిని మేళతాలు, బాణసంచా వేడుకల నడుమ జలప్రవేశానికి తరలించనున్నట్లు తెలిపారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

– సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర



పోలీసులకు సూచనలిస్తున్న న్యాయమూర్తులు

పుత్తూరు: సబ్ కోర్టు ఆవరణలో జూలై 5వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడంలో పోలీసులు కీలకపాత్ర పోషించాలని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు ఎస్.సి.రాఘవేంద్ర కోరారు. మంగళవారం కోర్టులో పోలీసులతో లోక్‌అదాలత్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ అన్ని రకాల సివిల్ కేసులు, వివాహ సంబంధ మనోవర్తి, చెక్కు బౌన్స్ కేసులు, రాజీ చేసుకోదగ్గ క్రిమినల్ కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. అలాగే ప్రీ లిటిగేషన్ కేసులు(కోర్టులో పెండింగ్‌లో లేని కేసులు) సైతం రాజీ చేస్తామని వెల్లడించారు. లోక్ అదాలత్‌లో తీర్పు అంతిమ తీర్పు అని, దీనిపై అప్పీలుకు వెళ్లడానికి అవకాశమే లేదని స్పష్టం చేశారు. పోలీసులు ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి కె.రమ్యసాయి, సీఐ సురేంద్రనాయుడు, పుత్తూరు, ఎస్‌ఆర్‌పురం, వెదురుకుప్పం, వడమాలపేట ఎస్‌ఐలు ఓబయ్య, సుమన్, వెంకటసుబ్బయ్య, ధర్మారెడ్డి, ఎక్సైజ్ ఎస్‌ఐ అంజాద్‌బాషా, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



మాదకద్రవ్యాల నిర్మూలనపై ర్యాలీ ప్రారంభిస్తున్న ఎక్సైజ్ సీఐ మురళీమోహన్

పుత్తూరు: విద్యార్థులు, యువత, పిల్లలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎక్సైజ్ సీఐ బి.మురళీమోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం పై వ్యతిరేకంగా అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం నేర ప్రవృత్తిని ప్రేరేపిస్తుందని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసైతే విలువైన జీవితం ఛిద్రం అవుతుందన్నారు. డ్రగ్స్‌కు అలవాటుపడితే దొంగతనాలు, దోపిడీలకు అలవాటు పడి జైలుపాలవుతారని హెచ్చరించారు. ప్రత్యేకించి విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల గురించి తెలిస్తే వెంటనే పోలీసులకు టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సుభాషిణి, ఎక్సైజ్ ఎస్‌ఐ అంజాద్‌బాషా, కళాశాల చైర్మన్ ఉమామహేశ్వర్, ప్రిన్సిపల్ మాణిక్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల నిరసన



నగరిలో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు



పుత్తూరులో మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల ఆందోళన

నగరి: ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ మున్సిపల్ ఇంజినీరింగ్ ఔట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన నిరసన మంగళవారం కూడా కొనసాగింది. మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన వారు నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన మేరకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు తమ సమస్యలపై వెంటనే స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.

పుత్తూరులో..

పుత్తూరు: నగర, పురపాలక సంఘాల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘాలు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె బాట పట్టాయి. రాష్ట్ర కమిటి పిలుపు మేరకు మంగళవారం పుత్తూరు మున్సిపల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. గణేష్ మాట్లాడుతూ గత కొంత కాలంగా సమస్యలు పరిష్కరించమని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా స్పందన లేదన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని యూనియన్లు ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పడి సమ్మె నోటీసు ఇచ్చామన్నారు. సమ్మె నోటీసు కాల వ్యవధి ముగియడంతో అన్ని యూనియన్ల వర్కర్లు నిరవధిక సమ్మె బాట పట్టినట్లు స్పష్టం చేశారు. తమ సమ్మె కారణంగా ప్రజలకు కలిగే అసౌకర్యానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. తాము కోరుతున్నట్లు మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ విభాగం ఔట్ సోర్సింగ్ కార్మికులకు టెక్నికల్ జీతం కింద నెలకు రూ.29,200, నాన్ టెక్నికల్ కింద రూ.24,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి నాయకులు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని, ఔట్ సోర్సింగ్ కార్మికులకు రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ కింద రూ.10 లక్షలు, రూ.10 వేలు పింఛన్ అమలు చేయాలని కోరారు. కారుణ్య నియామకాలు, మెడికల్ లీవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం అయ్యేంత వరకు తమ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మణిగండన్, సురేష్, చంద్రశేఖర్, భారతి, కోమలి, సుభాషిణి, మునికృష్ణ, మణికంఠన్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల కమిటీలు



యువత విభాగం అధ్యక్షుడిగా వెంకటేష్, మహిళా అధ్యక్షురాలుగా మోహనకుమారి, పంచాయతీరాజ్ అధ్యక్షుడిగా ఆకుల గోపి, ఆర్టీఐ కమిటీ అధ్యక్షుడిగా గాంధీ, రైతు విభాగం అధ్యక్షుడిగా మురళీరెడ్డి, ఎస్టీసెల్ విభాగం అధ్యక్షుడిగా షణ్ముగం

కార్వేటినగరం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కార్వేటినగరం మండలంలో పార్టీ అనుబంధ కమిటీల నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు మండల కన్వీనర్ శేఖర్‌రాజు మంగళవారం ప్రకటించారు. మండల యువజన అధ్యక్షుడిగా వెంకటేష్(హరీష్), ఉపాధ్యక్షులుగా ఎస్.మహేష్, ఎస్. ధనశేఖర్, ప్రధాన కార్యదర్శులుగా సునీల్, ప్రవీణ్‌కుమార్, భరత్‌రెడ్డి, ఎ.శివకుమార్, కార్యదర్శులుగా సురేష్, వి.రవి, కరుణ, సీడీ రాహుల్‌రెడ్డి, అరుణాచలం, కార్యవర్గ సభ్యులుగా డి. గోపి, సాయికుమార్, లతీష్‌రెడ్డి, కిషోర్‌కుమార్, ఎ.వినోద్‌రెడ్డి, విజ్జు, జగదీష్ నియమితులయ్యారు.

మహిళా విభాగం

మండల మహిళా విభాగం అధ్యక్షురాలిగా మోహనకుమారి, ఉపాధ్యక్షులుగా దేశమ్మ, చిన్ని, ప్రధాన కార్యదర్శులుగా అంబిక, గిరిజ, బి.షీలారాణి, కార్యదర్శులుగా మోహనమ్మ, చాముండేశ్వరీ, సుబ్బమ్మ, వి.లక్ష్మి, టి.విజయ, కార్యవర్గ సభ్యులుగా ఆర్.సుమతి, మంగమ్మ, యేసమ్మ, లక్ష్మి, ఎ.సుమతి, ఎస్.అమ్ములు, శారద, లత, పి.హేమలత నియమితులయ్యారు.

పంచాయతీ రాజ్ కమిటీ విభాగం

పంచాయతీ రాజ్ కమిటీ అధ్యక్షుడిగా ఆకుల గోపి, ఉపాధ్యక్షులుగా లోకనాథనాయుడు, జేజేలురెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ప్రేమనాథరెడ్డి, వెంకటరెడ్డి, పద్మనాభరెడ్డి, జేమ్స్, కార్యదర్శులుగా శ్రీనివాసులు, ఆనందయ్య, జనార్ధన్‌రెడ్డి, మాయక్రిష్ణ, చంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా మాధవరాజు, లోకనాథరెడ్డి, నరసింహులు, శివ, భాస్కర్‌రెడ్డి, ఓ.రమేష్‌రెడ్డి, బాలాజీరెడ్డి, బి.శ్రీధర్‌రెడ్డి, దాము నియమితులయ్యారు.

ఆర్టీఐ కమిటీ

ఆర్టీఐ కమిటీ మండల అధ్యక్షుడిగా గాంధీ, ఉపాధ్యక్షులుగా చంద్రబాబు, పి.చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.గిరి, పి.దిలీప్, మురగయ్య, రత్నంరెడ్డి, కార్యదర్శులుగా రామిరెడ్డి, జల్సా, సురేష్, శేఖర్‌రెడ్డి, వెంకటరత్నం, కార్యవర్గ సభ్యులుగా పురుషోత్తం ప్రసాద్, మహేష్‌బాబు, జానీ, పురుషోత్తంరెడ్డి, అదీమ్‌బాషా, రాజు, విజయకుమార్ నియమితులయ్యారు.

రైతు విభాగం

రైతు విభాగం విభాగం అధ్యక్షుడిగా మురళీరెడ్డి, ఉపాధ్యక్షులుగా మునేంద్రరెడ్డి, కుప్పారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ధనుంజయులురెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, గోవిందరెడ్డి, భాస్కర్ రెడ్డి, ప్రభాకర్‌రాజు, కార్యదర్శులుగా సుధాకర్‌రెడ్డి, మూర్తి, రమేష్‌యాదవ్, సుబ్బయ్య, బాబురెడ్డి, కార్యవర్గ సభ్యులుగా అర్జునయ్య, కె.సుబ్బయ్య, హరికృష్ణ, చిన్ని, దసరాజ, సుబ్రమణ్యం, వాసుమందడి నియమితులయ్యారు.

ఎస్సీసెల్ కమిటీ

ఎస్సీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా ఎం.మురగయ్య, ఉపాధ్యక్షులుగా సి.దొరస్వామి, టి.సురేష్, ప్రధాన కార్యదర్శులుగా అర్జునయ్య, డి.వెంకటేష్, ఇ.ఆరుముగం(యువరాజు), కార్యదర్శులుగా నాగరాజు, ఎస్.రవి, కె.రవి, నాగయ్య, త్యాగరాజు, ఆరుముగం, కార్యవర్గ సభ్యులుగా గోవిందస్వామి, విక్రమ్, మధు, సంజీవయ్య, బి.ధనుంజయులు, శరత్‌బాబు, శశికుమార్, జయపాల్, అయ్యప్ప, సుక్కలయ్య, జయచంద్ర, వర్మ నియమితులయ్యారు.

సోషల్ మీడియా విభాగం

సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యక్షులుగా విజయ్‌యాదవ్, ఎం.త్యాగురాఘవ, ప్రధాన కార్యదర్శులుగా పరంధాం, రాకేష్, ఎస్.రెహన్, కార్యదర్శులుగా కోదండరెడ్డి, రఘు, ధనూష్, అజిత్, కార్యవర్గ సభ్యులుగా పీఎం సోమేష్, గోవర్ధన్‌రెడ్డి, రుద్రవేలు, మోహన్, తరుణ్‌రెడ్డి నియమితులయ్యారు.

ఎస్టీ సెల్ విభాగం

ఎస్టీసెల్ విభాగం అధ్యక్షుడిగా ఎస్.షణ్ముగం, ఉపాధ్యక్షులుగా మహేష్, నరేంద్ర, ప్రసాద్, పి.మహేంద్ర, జి.మోహన్, కార్యదర్శులుగా బాల, కుప్పయ్య, సునీల్, రమేష్, జి.ధనుంజయులు, కార్యవర్గ సభ్యులుగా రవి, రమేష్, సోమశేఖర్, గజేంద్ర, బాబు, చిరంజీవి, మురళీ, శివ, శ్రీను నియమితులయ్యారు.

విద్యార్థి విభాగం

విద్యార్థి విభాగం కమిటీ అధ్యక్షుడిగా జ్ఞానసాయి, ఉపాధ్యక్షులుగా సి.పవన్, సాయిశివరామన్, ప్రధాన కార్యదర్శులుగా దిలీప్, కార్తీక్‌రాజు, వెంకటేష్‌రెడ్డి, కార్యదర్శులుగా పరుశురామన్, ఉదయ్, చలపతి, ఏకాంబరం, కార్యవర్గ సభ్యులుగా రంజిత్, అనిల్‌కుమార్, లోకేష్, రఘు, నవీన్, ప్రశాంత్‌కుమార్, మనోజ్ నియమితులయ్యారు.

వలంటీర్ల విభాగం

వలంటీర్ల విభాగం అధ్యక్షుడిగా ఎ.బాలాజీ, ఉపాధ్యక్షులుగా మనోహర్‌రెడ్డి, ముకేష్, ప్రధాన కార్యదర్శులుగా రాజేంద్ర, బాలాజీ, ఘంటశాల, కార్యదర్శులుగా జగదీష్, దిలీప్‌కుమార్, రుక్కుబాబు, ఎం.మణికంఠ, టి.మణికంఠ, కార్యవర్గ సభ్యులుగా సురేష్, చరణ్, మురళీ, సంతానం, కళ్యాణ్, భార్గవి, సతీష్ నియమితులయ్యారు.

మాధవరంలో వైభవంగా జాతర



అమ్మవారికి సారె తీసుకువస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి

యాదమరి: మండల పరిధిలోని మాధవరంలో గంగమ్మ జాతర మంగళవారం వైభవంగా సాగింది. జెడ్పీ వైస్ చైర్మన్ బి.ధనుంజయరెడ్డి అమ్మవారికి సారెను సమర్పించారు. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి. జెడ్పీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ ఎంపీపీ సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఏటా గంగ జాతర నిర్వహించడం అభినందనీయమన్నారు.